

APTEL/26/A1730

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



సంపుటి : 01 సంచిక : 01 అమరావతి | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 వెల : 5/


## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ఏర్పాటుకు యత్నం



**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ (కేంద్ర సచివాలయం) నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసింది. సుమారు రూ. 2534 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను కేంద్ర ప్రజా పనుల విభాగం (సీపీడబ్ల్యూడీ) కేంద్ర కేబినెట్ ఆమోదానికి పంపింది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించి, నిర్మాణం పూర్తయితే అమరావతి కేంద్రంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ ఒకే గొడుగు కిందకు రానున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం అన్ని ఆఫీసులను ఒకేచోట ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ పరిణామంపై ఏపీ బీజేపీ నేతలు స్పందించారు. రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని వారు తెలిపారు. కీలక ప్రాజెక్టుల ద్వారా అమరావతి అభివృద్ధికి తమ పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్ర కేబినెట్ ఆమోదం లభించిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులు పట్టాలెక్కే అవకాశం ఉందని, ఇది రాజధాని అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు

# భూమి ఆస్తి మాత్రమే కాదు, అది జీవనాధారం

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9**భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని అది జీవనాధారం, భద్రత, గౌరవమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే లక్ష్యంతోనే పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నట్లు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో గురువారం'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ఇక్కడకు వచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. మీ సంతోషంతో నా జన్మ ధన్యమైంది: పట్టాదారు పాస్‌పుస్తకం తమ చేతికందినప్పుడు ప్రజల్లో కలిగిన సంతోషం చూసి జన్మ ధన్యమైందని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం ఎంత విధ్వంసం అవ్వాలో అంత అయిందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకండా పోయిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయన్న సీఎం వాటిని ఇప్పుడు కూటని ప్రభుత్వం దారిలో పెడుతూ వస్తుందన్నారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు: గత ప్రభుత్వంలో నాయకులు ప్రజల భూమిపై కన్నేశారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో,



ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని, పట్టా పుస్తకంపైన జగన్ ఫొటో వేసుకున్నారని గుర్తు చేశారు. ఆస్తి మీదైతే- ఫొటో ఆయనది ఉండేదని అన్నారు. గత పాలకులు చేసిన అక్రమాలు, పాపాలు ఇప్పటికీ ఇంకా వెంటాడుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. గత పాలకులు చేసిన పనులు చూస్తే మతిపోయిందని, నూటికి 90 శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీకు భూ హక్కు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని అప్పుడే సంకల్పించినట్లు చంద్రబాబు తెలిపారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు ప్రజలకు ఇచ్చామని తెలిపారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని చంద్రబాబు వివరించారు. 'మీకు ఇచ్చే పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరు. కరెన్సీకి వాడే సాంకేతికతే పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడాం. మీ ముందు సర్వే చేయించి రికార్డు చేస్తాం. ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తాం. భూ యజమాని సమక్షంలో మొత్తం ప్రక్రియ నిర్వహిస్తున్నాం. రూపాయి కూడా అవినీతి లేకుండా పాస్ పుస్తకాలు ఇవ్వాలనేది నా ఆలోచన. రికార్డులు ట్యాంపర్ కాకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ తెచ్చాం. పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఇచ్చాం. మీ భూమి వేరే ఎవరూ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రికార్డులకు డిజిటల్ లాక్ చేసుకునే అవకాశం కల్పించాం. భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తున్నామన్నారు

## బాలల హక్కుల పరిరక్షణ బృహత్తరమైన బాధ్యత



**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** బాలల హక్కుల పరిరక్షణ ఒక బృహత్తరమైన బాధ్యత అని, నిస్వార్థంగా పిల్లల హక్కుల పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, వికాసం కోసం పాటుపడాలని ముఖ్యమంత్రి నూతన కమిషన్‌కు దిశా నిర్దేశం చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎంపికైన కమిషన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ను సెక్రటేరియట్‌లో కలిసింది. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్ చేస్తున్న కృషికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారని చైర్ పర్సన్ తెలిపారు. కమిషన్ సభ్యులను ఆత్మీయంగా పలకరించిన ముఖ్యమంత్రి . నిస్వార్థంగా బాలల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషిచేసి సమాజానికి ఉత్తమ పౌరులను అందించేలా కమిషన్ పనిచేయాలని ఆకాంక్షించారు. సీఎంను కలిసిన వారిలో కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, పద్మలత, డాక్టర్ నాగ మానస, డాక్టర్ శ్రీనివాసమూర్తి, మందాల గంగ సూర్యనారాయణ, చల్ల మధుసూదన రావు ఉన్నారు.

## రాజకీయ చరిత్రను మార్చిన ప్రజా "ప్రస్థాన పాదయాత్ర



**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** 2003 సంవత్సరంలో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంది వ్యవసాయం కూలి పనులు లేక ప్రాజెక్టులో నీళ్ళు లేక పశు పక్షులు విల విలాడిపోతున్నారు ఒక వైపు రైతులు. రైతు కూలీలు చేనేత కార్మికులు. ఆత్మహత్యలువీటిని చూసి చలించి వైఎస్ పాదయాత్రకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు అన్నారు గురువారం భవానీపురంలో ప్రజాప్రస్తాన పాదయాత్ర 23వ వార్షికోత్సవ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి వైఎస్ చేసిన 1450 కిలోమీటర్లు పాదయాత్ర రాష్ట్ర దశ దిశను మార్చేసిందన్నారు .. 2004లో అధికారం చేపట్టి పదవి ప్రమాణ స్వీకారం రోజే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల ఫైల్ మీద మొదటి సంతకం చరిత్రను సృష్టించారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు ... మొదట మాజీ కార్పొరేటర్ షేక్ రహంతున్నిసా. పార్టీ ఎస్ ఈ సి సభ్యుడు డి జె పి కెన్నెడీ తదితరులు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల దండ వేసి నివాళులు అర్పించారు పాత శివాలయం మాజీ చైర్మన్ బొమ్మ మధు. రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి సుబ్బారెడ్డి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ హయత్ షరీఫ్. పశ్చిమ నియోజక వర్గం యూత్ విభాగం అధ్యక్షుడు రాజ శేఖర్ రెడ్డి. క్లస్టర్ అధ్యక్షులు బోండా నిరీశ్ జిల్లా వైఎస్ఆర్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# దేశంలో మహిళా-స్నేహపూర్వక టాప్ టెన్ నగరాలు

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** భారతదేశంలో మహిళలకు ఉత్తమమైన నగరాలను ఒక కొత్త నివేదిక వెల్లడించింది ఈ ర్యాంకింగ్‌లు మిమ్మల్ని ఆశ్చర్యపరచవచ్చు. కొన్ని నగరాలు భద్రత , ఉద్యోగ అవకాశాలలో ముందుండగా, మరికొన్ని ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. భారతదేశంలోని నగరాలు నెమ్మదిగా మహిళలకు మరింత మెరుగ్గా సమ్మిళితంగా మారుతున్నాయిమహిళల కోసం అవతార్ టాప్ సిటీస్ 2025 తాజా నివేదిక, ఏ ప్రదేశాలు అత్యధిక పురోగతిని సాధిస్తున్నాయో చూపిస్తుంది. కొన్ని నగరాలు భద్రత , కెరీర్ల విషయంలో ముందుండగా, మరికొన్ని ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. బెంగళూరు ఈసారి ఏడాది కూడా అగ్రస్థానంలో నిలిచింది. సిటీ ఇన్‌క్లూజన్ స్కోర్ లో ఇది 53.2 స్కోరు సాధించింది. ఈ నగరం పుష్కలమైన ఉద్యోగ అవకాశాలను అందిస్తుంది, సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుంది మహిళల దైనందిన జీవితాన్ని సులభతరం చేస్తుంది. మంచి పరిశ్రమలు, బలమైన కెరీర్ మద్దతు ఈ నగరం నంబర్ వన్‌గా నిలవడానికి దోహదపడ్డాయి. మెరుగైన పోలీసింగ్, అభివృద్ధి చెందిన ప్రజా సౌకర్యాలు కూడా దీనికి దోహదపడుతున్నాయి. 49.8 స్కోరుతో చెన్నై రెండో స్థానంలో నిలిచింది. భద్రత, ప్రజా రవాణా, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి రంగాలలో ఇది



మంచి పనితీరు కనబరిచింది. ఈ అంశాలు మహిళలు దైనందిన జీవితంలో మరింత భాగస్వామ్యం అయినట్లు భావించడానికి సహాయపడతాయి. 46.2, 46.4, 44.4 స్కోర్లతో పూణే, హైదరాబాద్, ముంబై నగరాలు టాప్ ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ నగరాలు మహిళలకు పని అవకాశాలను, సహాయక వాతావరణాన్ని సమతుల్యం చేయడంలో మంచి పనితీరు కనబరుస్తున్నాయి. ఈ సంవత్సరం ర్యాంకులో బాగా పైకి వచ్చిన నగరాల్లో గురుగ్రామ్ ఒకటి. ఇది తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి ఎగబాకింది. కార్యాలయాల్లో మెరుగైన సమ్మిళితత్వమే ఇందుకు ప్రధాన కారణం. అక్కడ ఇప్పుడు మరిన్ని కంపెనీలు మహిళల కెరీర్‌కు, ఎదుగుదలకు మద్దతు ఇస్తున్నాయి. అయినప్పటికీ, ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా వంటి నగరాల్లో బలమైన ఉద్యోగ మార్కెట్లు ఉన్నప్పటికీ, భద్రత, అందుబాటు ధరలు, నగరం చుట్టూ సులభమైన ప్రయాణం వంటి విషయాల్లో మెరుగుపడాల్సిన అవసరం ఉందని నివేదిక సూచిస్తోంది. మహిళల భాగస్వామ్యం, భద్రత వృత్తి కొనసాగింపు వంటి అంశాలపై నగరాలను మూల్యాంకనం చేసే ఒక వివరణాత్మక చట్రం ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు రూపొందించారు. దీనిని సిటీ ఇన్‌క్లూజన్ స్కోర్ ద్వారా పొందుపరుస్తారు, ఇది సోషల్ ఇన్‌క్లూజన్ స్కోర్ , ఇండస్ట్రియల్ ఇన్‌క్లూజన్ స్కోర్ అనే రెండు కీలక భాగాలను మిళితం చేస్తుంది. భద్రత, జీవనయోగ్యత సమాజంలో మహిళల ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిశీలిస్తుండగా, ఉద్యోగ అవకాశాలు, ప్రాతినిధ్యం సహాయక వ్యవస్థలతో సహా కార్యాలయాలు ఎంత

మిగతా 2లో

## విజయవాడలోపెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** విజయవాడ నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేలా అధికారులు దృష్టి సారించాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధి పై అధికారులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా నేతృతంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అన్ని విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగరంలో అభివృద్ధి పనులను ప్రస్తావించారు నగరంలో ఆగిపోయిన స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులు, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం పై సమీక్ష నిర్వహించారు. స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఇప్పటికే రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ దృష్టి కి తీసుకెళ్ళామని ఎంపీ తెలిపారు. నగర పాలక సంస్థకు ప్రస్తుతం ఉన్న ఆదాయ వనరులపై చర్చించారు. నగరపాలక సంస్థ సమన్వయంతో నగరంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో చర్చించారు. వాంబే కాలనీ , మధురానగర్ వద్ద రైల్వే వంతెనల నిర్మాణ పరమైన విషయాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలను చేశారు. కాలువల సుందరీకరణ తదితరాలపై చర్చించారు . అతి త్వరలో విజయవాడ నగరపాలక సంస్థ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో సమావేశం ఉ



ంటుందని అధికారులకు తెలిపిన ఎంపీ చిన్ని ఆ సమావేశం నాటికి నగర సమగ్ర అభివృద్ధిపై ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. .ఇటీవలే నగర పాలక సంస్థ గవర్నింగ్ కౌన్సిల్ పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం అభివృద్ధి పనులన్నీ అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయన్నా నగర అభివృద్ధి క్రమంలో అడ్డంకులుగా ఉన్న సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. కార్పోరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

## అంగన్‌వాడీల రూపురేఖలు సమూల మార్పు

### 55,766 కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన

### పోషణ పక్వాడాను ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** గర్భిణీల నుండి రెండు సంవత్సరాల లోపు చిన్నారులకు సరైన పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించే పోషణ పక్వాడ 2026 కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గర్భిణీ ల నుండి రెండు సంవత్సరాల లోపు చిన్నారులకు సరైన పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారం పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, ఈ విషయంపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు



నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలతో నేరుగా సంభాషించడం ద్వారా వారి తెలివితేటలను పెంపొందించడంపై తల్లిదండ్రులకు మార్గదర్శనం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ, ఆటపాటల ద్వారా పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఆటవస్తువులతో పాఠాలు బోధించడం, వారి ఐక్యూ స్థాయిని పర్యవేక్షించడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు , చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారి వరకు సరైన పోషణ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పోషణ పక్వాడ ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో పోషకాహారం పై చైతన్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేస్తున్నాం. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, అందుకే మహిళల ఆరోగ్యం, శిశు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు.

### ప్రతి నేతన్నకూ 'ఉచిత విద్యుత్'

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 19** అర్హులైన ప్రతి నేతన్నకూ ఉచిత విద్యుత్ ఫలాలు అందించాల్సిందేనని, ఇందుకు విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ .సవిత స్పష్టం చేశారు. చేనేతల్లో ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన కల్పించడానికి గ్రామ స్థాయిల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువుగా పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్ లో విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ చేనేతల కష్టాలను స్వయంగా చూశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి సైతం చేనేత కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే, అధికారంలోకి కూటమి వస్తే ఉచిత విద్యుత్ ఇస్తామని ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని రూ. 150 కోట్ల వ్యయంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు.

### పుదుచ్చేరిలో అత్యధిక పోలింగ్

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో అత్యంత కీలకమైన పోలింగ్ గురువారం జరిగింది ప్రారంభమైంది. అస్సాంలో బీజేపీ మరో విజయంపై కన్నేసి ఉండగా, కేరళ లెఫ్ట్ ఫ్రంట్ వరుసగా ఐదోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామికి చెందిన ఏఐఎన్ఆర్‌సి నాలుగో విజయం కోసం సిద్ధమైంది. ఎన్నికల ఈ దశలో అస్సాంలో 126 స్థానాలకు, కేరళలో 140 స్థానాలకు, పుదుచ్చేరిలో 30 స్థానాలకు పోలింగ్ జరిగింది

# సంపాదకీయం

### యువత ఆలోచనలు భావోద్వేగాలకు
## దూరంగా ఉండాలి

దేశ భవిష్యత్తుకి విద్యార్థులే నావికులు.వారి ప్రతిభ, జ్ఞానం... సమాజానికి, దేశానికి ఉపయోగపడాలి మేధస్సు, సంస్కృతి, దేశ నిర్మాణం అనే మూడు స్థంభాలపై నిర్మితమైందిజశతాబ్ద కాలంగా వేలాది మంది మేధావులను సమాజానికి అందించింది.వారి స్ఫూర్తితో సమాజాన్ని మార్చే బలమైన శక్తులుగా విద్యార్థి యువతఎదగాలి ఇలాంటి సందేశాలను ఏపీ ఉపము ఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందచేశారు. బుధవారం విశాఖపట్నం లో జరిగిన ఆంధ్రాయూనివర్శిటీ సాంస్కృతిక కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అయితే ఇప్పటి యువత ఎక్కువ శాతం మందిలో అవేశ కావేశాలే కనిపిస్తున్నాయ్, శాంతం సహనం లోపించాయి అదేమంటే ఇదివరకటిలా కూర్చుంటే లాభం లేదు. ఆధునిక యుగం, పరిణామాలు శరవేగంగా మారుతున్న క్రమంలో ఆచరణలో కూడా అదే ఉండాలన్న ధోరణి వచ్చేలసింది. రఫా రఫా అంటూ అవేశ కావేశాలకు లోనవుతున్నారు. విద్యార్థులలోనే గ్రూపులుగా ఉన్నవారిలో ఒకరు ఎవరైనా ఎదైనా అంటే లేదంటే అతని మీద పగ ద్వేషం పెట్టుకునే తమకు సహకరించడంలో పట్టుకుని వేధించడమే కాదు, చితకబాదేస్తున్నారు. ర్యాగింగ్‌లు పూర్తిగా తగ్గాయనడానికి కూడా వీల్లేదు. ఒక స్టేజ్ దాటిన తరువాత తల్లి తండ్రుల కంట్రోల్ తప్పి పోతున్నది. డ్రగ్స్‌కు చాలా మంది బానిసలవుతున్నారు. ప్రభుత్వం ఎన్ని ఎవేరెనెస్ కార్యక్రమాలను నిర్వహించినా , డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న వారు కూడా ఉన్నారు. డ్రగ్స్ తీసుకునడానికి కూడా అనేక మానసిక కారణాలు, తన చుట్టూ ఉన్న వాతావరణ పరిస్తితులు దోహదం చేస్తున్నాయి దేశంలో ఎక్కడో ఒక చోట నిత్యం డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి, గంజాయి కూడా అదేవిధంగా రవాణా అవుతున్నది. ఈ దశలో చాలా మంది పెద్దలు హిత బోధ చేస్తారు. మరో వైపు ఏపీ ప్రభుత్వం కూడా నైతికవిలువల బోధనలకు శ్రీకారం చుట్టింది పవన్ కల్యాణ్ చెప్పిన మాటలను యువత అచరణలో పెట్టాల్సి ఉంది 'యువత ఏ ఒక్క భావజాలాన్ని గుడ్డిగా నమ్మవద్దు. ఎవరి ఐడియాలజీని గుడ్డిగా నమ్మి ప్రభావితం కావద్దు. యువత ప్రభావితం అయిన భావజాలం ఈ కాలానికి సరిపోతుందా? లేదా అనేది ఒకటికి పదిసార్లు ఆలోచించి ముందుకు వెళ్లండి. భావోద్వేగాలతో కాకుండా వాస్తవికత ఆధారంగా ఆలోచనలు చేయాల'ని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్య అని, సమాజ సేవే యువత ధ్యేయం కావాలని కోరారు తన ఆఖరిశ్వాస వరకు భవిష్యత్ తరాల కోసమే పని చేస్తానని తెలిపారు. జీవితంలో ఎటువైపు వెళ్లాలి అనే మార్గాన్ని ఎంచుకునే ఆలోచన యూనివర్శిటీతో మొదలవుతుంది. ఆ గమ్యాన్ని ఎలా చేరుకోవాలనేది మాత్రం స్వశక్తితోనే నిర్ణయించుకోవాలి. కేవలం విశ్వ విద్యాలయం విద్యార్థులుగా మాత్రమే కాదు.. ఈ విశ్వ విద్యాలయం భవిష్యత్తు . ఇక్కడ గడిపే రోజులు జీవితంలో ముఖ్యమైన క్షణాలు ఆలోచనలు తీర్చిదిద్దే అద్భుత క్షణాలు. దేశ భవిష్యత్తుకు మీరేనావికులు. విద్య అంటే పుస్తకాల్లో ఉన్న జ్ఞానం మాత్రమే కాదు. సమస్యల్ని ఎదుర్కోగలిగే ధైర్యం. సరైన నిర్ణయాలు తీసుకునే వివేకం. సమాజానికి ఉపయోగపడే బాధ్యత. సౌతాఫ్రికా అధ్యక్షునిగా చేసిన శ్రీ నెల్సన్ మండేలా మాటల్లో చెప్పాలంటే ప్రపంచాన్ని మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య. లక్ష్యం కేవలం ప్రతిభ కాదు. ధ్యేయం సమాజ సేవ కూడా కావాలి. జ్ఞానం సొంతం కోసమే కాకుండా, సమాజానికి, దేశానికి ఉపయోగపడాలంటూ ఆయన చెప్పిన మాటలను విద్యార్థి యువత ఆచరణలోకి తీసుకురావాలి కారల్ మార్క్స్ లాంటి వ్యక్తులు, తనలాంటి వ్యక్తులు ఎవరు ఏ ఐడియాలజీ చెప్పినా గుడ్డిగా నమ్మి ప్రభావితం కావొద్దు. ఆ సిద్ధాంతం ఈ కాలానికి సరైనదా? కాదా? భవిష్యత్తుల్లో నిలబడుతుందా? లేదా? అని ఒకటికి పదిసార్లు ఆలోచించాలి. కేవలం భావోద్వేగాలతో కాకుండా వాస్తవాలు, తర్కం ఆధారంగా ఆలోచించాలి. 80, 90ల్లో బ్యాలెన్స్ లేని ఐడియాలజీ నమ్మి ఎంతో మంది అడవులకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. ఏదైనా ఒక ఐడియాలజీ నమ్మే ముందు ధర్మబద్ధంగా ఉందా? రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉందా? దేశ సమగ్రతను కాపాడుతుందా? అని ఆలోచన చేయాలి. మనం ప్రభావిత మయ్యే ఐడియాలజీ ఒక వర్గానికి, ఒక కులానికి లేదా ఒక మతానికి మాత్రమే లాభం చేకూరుస్తూ, మిగిలిన వారిని తక్కువ చేసి చూస్తుంటే అది నైతికంగా సరైనది కాదు అని అర్థం. విశ్వ విద్యాలయాల్లో ఎంతో మంది విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన విద్యార్థి సంఘాలు ఉండొచ్చు. వాళ్లు ఏ ఐడియాలజీ చెప్పినా ఒకటికి పదిసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఈ మాటలు పార్టీ పెట్టిన కొత్తలో చెప్పటం లేదు. పార్టీ పెట్టి దశాబ్ద కాలం తరువాత చెబుతున్నాను. ఎన్నో ఎదురు దెబ్బలు తిని, నలిగిన తరువాత చెబుతున్నాను. ఏదైనా ఒక ఐడియాలజీని నమ్మే ముందు భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ఒక సమగ్రమైన నిర్ణయానికి రండి అంటూ పవన్ కల్యాణ్ హితబోధ చేశారు అయితే ఇప్పటి యువత ఒకటికి పదిసార్లు తరచి ఆలోచన చేసే పరిస్తితిలో లేరు గాని, మార్పు రావాలని మాత్రం ఆకాంక్షింపక తప్పదు.దేశ అభివృద్ధి యువత మీద ఆధారపడి ఉంటుంది. వారి శక్తి, ఉత్సాహం, సృజనాత్మకత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. వారిలో న్యూక్లియర్ ఎనర్జీ దాగి ఉంటుంది. తలుచుకుంటే ఒక పెద్ద విస్ఫోటనం సృష్టించగలరు. తనలాంటి వాడే సమాజానికి ఇంత చేయగలిగితే... మీరింకెంత చేయగలరో ఆలోచించాలి. యద్భావం తద్భవతి... మీరు ఒక భావాన్ని ఎంత బలంగా నమ్ముతారో ఆ భావం మంత్రంగా మారి... ఆ మంత్రం సాధనగా మారుతుంది. ఆ సాధన ఫలితాలు ఇస్తుంది. మంచి, చెడు మీరేది బలంగా నమ్మితే అది జరుగుతుంది. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు అవ్వాలని, మీలో ప్రతి ఒక్కరు బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఆశిస్తున్నానని ఆయన చక్కటి సందేహం ఇచ్చారు అందరూ మారుతారని అనుకోలేం గాని, ఏ కొందరైనా మారితే వారింకొందరికి స్ఫూర్తిగా నిలిస్తే అలా అలా మార్పు రావచ్చు

## దుర్గగుడిలో గోసంరక్షణ నిధికి విరాళం



**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9** విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన గుదే భరత్ గురువారం దుర్గగుడిలో గో సంరక్షణ ట్రస్ట్ కు 1,11,116 విరాళంగా అందజేసినారు. ఆలయానికి వచ్చిన దాతలు ఆలయ ఏఈఓ బీవీ రెడ్డిని కలిసి విరాళం అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతలకు ఆలయ మర్యాదలు అందచేశారు.

# దేశంలో మహిళా-స్నేహపూర్వక టాప్ టెన్ నగరాలు

మొదటి పేజి తరువాయి

సమ్మిళితంగా ఉన్నాయనే దానిపై దృష్టి పెడుతుంది. ఈ రెండు అంశాల మధ్య మంచి సమతుల్యతను పాటించడంలో కొన్ని నగరాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఉదాహరణకు, హైదరాబాద్, కోల్‌కతా పూణేలలో, సామాజిక . పారిశ్రామిక సమ్మిళితత్వం నిరంతరం ఏకకాలంలో కొనసాగుతూ, మహిళలు ఉపాధి పొందడానికి దీర్ఘకాలిక వృత్తిని కొనసాగించడానికి సులభతరం చేస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, ముంబైలో పరిస్థితి భిన్నంగా ఉంది. పారిశ్రామిక సమ్మిళితత్వంలో 69.00 అత్యధిక స్కోరు సాధించినప్పటికీ, దాని సామాజిక సమ్మిళితత్వ స్కోరు 38.44 వద్ద వెనుకబడి ఉంది. పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ, అధిక జీవన వ్యయం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలను ఇది



ఎత్తి చూపుతోంది. ఈ ఏడాది నివేదికలో అగ్రశ్రేణి స్థానాల్లో టైర్-2 నగరాల సంఖ్య పెరగడం మరో ఆసక్తికరమైన ధోరణి. దీనిని బట్టి, మహిళల పరిసరాలకు, అవకాశాలకు మద్దతు కేవలం మహానగర ప్రాంతాలకే పరిమితం కాకుండా, చిన్న పట్టణ ప్రాంతాలకు కూడా క్రమంగా విస్తరిస్తోందని తెలుస్తోంది.

**మహిళల భద్రత, ఆరోగ్య సంరక్షణ, విద్య** మూడు సూచికలలోనూ అత్యధిక సగటులతో, దక్షిణ భారతదేశం అత్యంత సమ్మిళిత ప్రాంతంగా అవతరించింది. ఇది ఆర్థిక వృద్ధికి అదనంగా, మహిళల భద్రత, ఆరోగ్య సంరక్షణ, విద్య మరియు మొత్తం జీవన నాణ్యతలో సమాజాలు పెట్టుబడి పెట్టే మరింత సమగ్రమైన వ్యూహాన్ని తెలియజేస్తుంది.

## రేపు జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి



**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9** బడుగుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతబ్ది జయంతిని ఈనెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జయంతిని రాష్ట్ర పండుగగా, అధికారికంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోరాష్ట్ర స్థాయి పూలే జయంత్యోత్సవంను నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కుల కోసం, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం జీవితాన్ని ధారపోశారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు.. అంతకుముందు ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ కు చెందిన శిల్ప కళాకారులు రూపొందించిన జ్యోతిరావు పూలే విగ్రహ నమూనాలను తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత పరిశీలించారు. వాటిని రూపొందించిన కళాకారులను మంత్రి అభినందించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, ఎం ఈశ్వరరావు, ఎరుబోతు రమణరావు, వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి గ్రహణం పట్టింది

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9**విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి గ్రహణం పట్టిందని గత 2 నెలలుగా ప్రభుత్వాసుపత్రిలో రెగ్యులర్ సూపరింటెండెంట్ ను ఎందుకు నియాకం చేయలేదని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు పోతిన వెంకటమహేష్ ప్రశ్నించారు.గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు బేరం కుదరలేదనా ? ఇంకా ఏమైనా కారణాలున్నాయనా రెగ్యులర్ సూపరింటెండెంట్ ఎందుకు నియమించలేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం నుండి కొత్త ప్రభుత్వాసుపత్రికి 8 కోట్ల రూపాయల బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాత సుపత్రిలో మహిళా సూపరింటెండెంట్ నియమించాలన్నారు గత రెండు నెలలుగా 400 మంది సానిటరీ సెక్యూరిటీ సిబ్బందికి జీతాల బకాయి ఉందన్నారుతక్షణమే కొత్త ప్రభుత్వాసుపత్రిలో రెగ్యులర్ సూపరింటెండెంట్ నియామకం చేసి,8 కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించి,శానిటరీ సెక్యూరిటీ సిబ్బంది జీతాల బకాయిలను చెల్లించాలన్నారు ఈ సందర్భంగా కొత్త, ఆసుపత్రి, ప్రభుత్వ పాత ఆసుపత్రులలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్తితులను, మందులు లేక పోవడం, ఎన్‌టీఆర్ వైద్య సేవ అందకపోవడం వంటి అనేక అంశాలను ప్రస్తావించారు.

## సజావుగా పదో తరగతి మూల్యాంకనం..

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సజావుగా జరుగుతోందని.. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ తెలిపారు.గురువారం కేబీఎన్ కళాశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేశారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. మూల్యాంకనంలో పాల్గొన్న ఎగ్జామినర్ల పనితీరును పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా మూల్యాంకన కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా మూల్యాంకన ప్రక్రియ జరిగేలా సూచనలిచ్చారు. మౌలిక వసతులు, భద్రతా చర్యలు, రికార్డుల నిర్వహణ, ట్యాబ్‌ల పనితీరు, మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 6న ప్రారంభమైన ప్రక్రియ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరుగుతోందని, కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు ఉన్నారు.

## చుండూరి లక్ష్మీకాంతరావుకు పరామర్శ

**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9** గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గాంధీజీ మహిళా కళాశాల చైర్మన్ చుండూరి లక్ష్మీకాంతరావు ( సీఎల్ కాంతారావు )ను ఆయన నివాసంలో సీనియర్ రాజకీయ నాయకుడు ఆకుల శ్రీనివాసకుమార్ పరామర్శించారు. , ఆయన ఆరోగ్యం గురించి ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లక్ష్మీకాంతరావు సేవలను ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ కొనియాడారు. విజయవాడ నగరంలో అన్ని వర్గాల వారికి ఎంతో సుపరిచితులైన ఆయన త్వరగా కోలుకోవాలని తనతో పాటు ఎంతోమంది ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.



గాంధీజీ మహిళా కళాశాల స్థాపించిన తర్వాత నుంచి వేలాది మందికి అతి తక్కువ ఫీజులతో విద్యాబోధన అందజేస్తున్నారని ప్రశంసించారు. ఎంతోమందికి అనేక రకాలుగా తన సహాయ సహకారాలను అందజేసి అండదండగా నిలిచారని పేర్కొన్నారు.

## పార్కుల అభివృద్ధితో అహ్లాదకర వాతావరణం

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** నగరంలోని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం స్వాతి రోడ్డు కుండల బజార్, హెచ్. బి కాలనీ ప్రాంతాలలో పర్యటించి పార్క్ నిర్వాహణ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవికాలంలో స్కూల్ పిల్లలకు సెలవులు ఉంటాయని వారికి ఆడుకోవటానికి వీలుగా పార్కులనుఅందంగా, ఆహ్లాదకరంగా ఉండేటట్టు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో పాటు నగర ప్రజలు వారి కుటుంబాలతో సాయంత్రం సమయాల్లో సేద తీరేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలోని ప్రతి పార్కులో ఎటువంటి మరమ్మతులు లేకుండా అధికారులు



చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్.బి కాలనీలో అన్న క్యాంటీన్ పరిశీలన

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ గురువారం విజయవాడలోని హెచ్ బి కాలనీ అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించారు క్యాంటీన్‌కు వచ్చే ప్రజలతో నేరుగా మాట్లాడి, అందిస్తున్న ఆహారంలో నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలు మెరుగ్గా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు క్యాంటీన్ వెలుపల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కేంద్రంలో ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించడం గమనించిన కలెక్టర్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని






తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి హానికరమని, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగిస్తూ మజ్జిగ పంపిణీ చేయాలని సూచించారు.అనంతరం క్యాంటీన్ పక్కనున్న పార్కులో జరుగుతున్న నిర్వహణ పనులను కూడా పరిశీలించారు. పార్కు నిర్వహణకు ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు, వారు ప్రతిరోజూ ఏ సమయాల్లో హాజరవుతారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కు శుభ్రత, నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## అయోధ్య-కాశీ: బైద్యనాథ్ ధామ్ దర్శన్ యాత్ర

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9**తీర్థ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ "సమ్మర్ స్పెషల్ ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్ల" ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈనెల 14 వ నుండి జూన్ 12 వ తేదీ లలో 4 ప్రత్యేక ప్యాకేజీలను "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ ( ఐఆర్‌సీటీసీ)జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూరి కోణార్క్-బైద్యనాథ్ ధామ్ - వారణాసి అయోధ్య ప్రయాగరాజ్. యాత్ర ఈనెల 28వ తేదీన ప్రారంభమై మే 7 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16,700 -3 ఏసీ ధర 26,100,2 ఏసీ ధర 34,100 గా ఉంటుంది ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని,దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా వెళ్తుంది. మధుర-బృందావనం-మాతా వైష్ణోదేవి-హరిద్వార్- రిషికేశ్. ఈ యాత్ర మే 12వ తేదీన ప్రరంభమై మే 21వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16,500, 3 ఏసీ ధర 25,700, 2 ఏసీ ధర 33,400,ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ లో ప్రారంభమై భువనగిరి, జనగాం, కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల్ , బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్ నగర్, బల్లార్ష, వార్ధా నాగ పూర్ మీదుగా వెళ్తుంది. తిరువణ్ణామలై శిఅరుణాచలంరి - రామేశ్వరం - మధురై - కన్యాకుమారి - తిరుచి - తంజావూరు - చిదంబరం. ఈ యాత్ర మే 24 వ తేదీన ప్రారంభమై మే 31 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14,500, 3 ఏసీ ధర 21,700, 2 ఏసీ ధర 27,900, ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ ప్రారంభమై జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట




మీదుగా వెళ్తుంది. పూరి - కోణార్క్ - బైద్యనాథ్ ధామ్ - వారణాసి - అయోధ్య - ప్రయాగరాజ్. ఈ యాత్ర జూన్ 03 వ తేదీన ప్రారంభమై జూన్ 12 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16,700 3 ఏసీ ధర 26,100, 2 ఏసీ ధర 34,100,ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ లో ప్రారంభమై కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా వెళ్తుంది. భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం , రాత్రి భోజనం), వాటర్ బాటిల్ . టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు, ప్రయాణ బీమా.. కోచ్ కు ఒక సెక్యూరిటీ గార్డ్, రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు వివరాలకు 9701360701, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని మరిన్ని వివరాలకు ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్సైట్ ను చూడాలని తెలిపారు.

## పెద్ద ముప్పును తప్పించే హెచ్‌పీవీ టీకా



**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9** ఒక్క టీకా పెద్ద ముప్పును తప్పిస్తుందని.. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు.గురువారం . రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా కార్యక్రమంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని.. సమయానికి టీకా వేయడం ద్వారా ఇది పూర్తిగా నివారించగల వ్యాధి అని పేర్కొన్నారు.

## సర్వే తన ఘనతగా చెప్పుకుంటున్న చంద్రబాబు

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** అధికారంలోకి వస్తే భూ సర్వే ఆపేస్తానని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు సర్వే తన ఘనతగా చెప్పుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్నాడని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఇప్పుడు జరుగుతున్న సర్వేలన్నీ బూటకం. కనీసం హద్దు రాళ్లు కూడా ఉండటం లేదన్నారు . తన బినామీలకు భూములు దోచిపెట్టడానికే చంద్రబాబు సర్వేలు చేయిస్తున్నాడన్నారు . పేదల భూములు లూఠీకి గురవుతున్నాయన్నారు - వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా 42,307 వేల మంది రైతులకు 46,463 ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేశారన్నారు మామను వెన్నుపోటు పొడిచి పార్టీని, ముఖ్యమంత్రి పదవిని లాక్కున్న చంద్రబాబు తల్లి, చెల్లి గురించి మాట్లాడటానికి సిగ్గుపడాలన్నారువై ఎస్ జగన్ తన చెల్లికి రూ.263 కోట్లు నగదు రూపంలో ఇచ్చాడు. ఏరోజైనా చంద్రబాబు తన చెల్లెమ్మలకు ఆస్తులు రాసిచ్చి ఉంటే చూపించాలన్నారు. జగన్ ప్రతిపాదించిన మావిగన్ ఐడియా కూటమిలో వణుకు పుట్టిస్తోంది. మావిగన్ కి సమాధానం చెప్పుకోలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడన్నారు



## డ్రోన్ మిస్ట్‌తో కాలుష్యం కట్టడి

**విశ్వంవాయిస్,విజయవాడ,.ఏప్రిల్ 9**విజయవాడ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు వినూత్న చర్యగా డ్రోన్ల ద్వారా నీటి తుంపర్లు (మిస్ట్) వెదజల్లే కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్. జి.లక్ష్మీశ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గురువారం మహాత్మా గాంధీ రోడ్, అంబేద్కర్ స్మృతి వనం వద్ద ఈ కార్యక్రమాన్ని వీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు వీఎంసీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే మిస్ట్ వాహనాల ద్వారా ప్రతిరోజూ నీటి తుంపర్లు వెదజల్లుతున్నామని, ఇప్పుడు డ్రోన్ల వినియోగంతో ముఖ్య కూడళ్లు, అధిక రద్దీ గల ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా మిస్ట్‌ను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాన్ని కవర్ చేయగలమని, దీంతో వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా ప్రజల ఆరోగ్య రక్షణకు తోడ్పడుతుందని అన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో మజ్జిగ పంపిణీకి దాతలు సహకరించండి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** భక్తుల సౌకర్యార్థం ఇంద్రకీలాద్రిపై చల్లని మజ్జిగ, తాగునీటి పంపిణీ: దాతలు ముందుకు రావాలని ఈ.ఓ వి.కె. శీనా నాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారుఎండల తీవ్రత దృష్ట్యా ఇంద్రకీలాద్రికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేసవి కాలం ముగిసే వరకు భక్తులకు ఎండ వేడి నుండి ఉపశమనం కలిగించేలా ఉచిత తాగునీరు మజ్జిగ పంపిణీ పథకాన్ని భారీగా ప్రారంభించారు.భక్తుల దాహార్తిని తీర్చడానికి ప్రతిరోజూ కొండపై ఉచిత తాగునీటి సదుపాయం కల్పించారుగడచిన ఉగాది పర్వదినం నుండి జూన్ 15వ తేదీ వరకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు.



**రోజువారీ పంపిణీ:** సాధారణ రోజుల్లో ప్రతిరోజూ 2000 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.వారాంతాల్లో ప్రత్యేకంగా: భక్తుల రద్దీని బట్టి శుక్ర, శని, ఆదివారాల్లో 5000 మజ్జిగ ప్యాకెట్లు లేదా అంతకంటే ఎక్కువ పంపిణీ చేసేలా సిద్ధం చేశారు ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు రోజుకు కేవలం రూ. 650 చెల్లించి రశీదు పొంది ఈ పథకానికి విరాళం అందించవచ్చునన్నారు. దాతలు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు

## రైల్ పార్సెల్ యాప్‌ను వినియోగించండి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** అవాంతరాలు లేని, సమర్థవంతమైన పార్శిల్ బుకింగ్ డెలివరీ పరిష్కారాలను అందించే లక్ష్యంతో రూపొందించిన నెక్స్ట్-జనరేషన్ డిజిటల్ వేదికయిన రైల్ పార్శిల్ యాప్‌తో దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ తన సరుకు రవాణా పార్శిల్ సేవలను మరింత సమర్థంగా నిర్వహించడానికి సన్నద్ధమయింది.రైల్ పార్సెల్ యాప్ ను ఏడాది మార్చి 12 న విజయవాడ , రాజమండ్రితో సహా దక్షిణ మధ్య రైల్వేలోని కీలక ప్రాంతాలలో ప్రారంభించారు. ఈ యాప్ వినియోగదారుల సౌలభ్యం, పారదర్శకత కార్యాచరణ సామర్థ్యంపై గట్టి దృష్టి సారించి, పూర్తిస్థాయి లాజిస్టిక్స్ పరిష్కారాలను అందిస్తుంది.ఇంటింటికీ పార్శిల్ బుకింగ్ , డెలివరీ వంటి ఫీచర్లతో, ఈ యాప్ రైల్వే పార్శిల్ సేవలను ఆధునీకరించడంలో ఒక ముఖ్యమైన ముందడుగు వేస్తుంది. ఇది బుకింగ్ ప్రక్రియను సులభతరం చేయడం , నమ్మకమైన డెలివరీ యంత్రాంగాలను నిర్ధారించడం ద్వారా వినియోగదారులకు వ్యాపారం చేసే సౌలభ్యాన్ని పెంచుతుంది.డిజిటల్ ఆవిష్కరణలు వినియోగదారుల-కేంద్రీకృత సేవల ద్వారా పార్శిల్ లాజిస్టిక్స్‌ను బలోపేతం చేయడానికి భారతీయ రైల్వే అనుసరిస్తున్న విస్తృత వ్యూహంలో ఇది ఒక భాగం. ఇది ఇండియా పోస్ట్‌తో కలిసి చేపడుతున్న జాయింట్ పార్శిల్ ప్రొడక్ట్ చొరవ వంటి కొనసాగుతున్న ఏకీకరణ ప్రయత్నాలకు కూడా తోడ్పడుతుంది.ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, యాప్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే ప్రోత్సాహకరమైన ఆదరణ పొందిందని తెలిపారు. “గత నెలలో విజయవాడ నుండి రైలు ప్రయాణికులు 280 బుకింగ్‌లు చేశారని సౌకర్యవంతమైన, సమర్థవంతమైన పార్సెల్ బుకింగ్‌ల కోసం వినియోగదారులు రైల్ పార్సెల్ యాప్‌ను ఉపయోగించుకోవాలని తాము కోరుతున్నామని తెలిపారు

## పంచాయతీ నిధులపై పచ్చ ‘పందికొక్కుల’ కన్ను.

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రతినిధుల పదవీకాలం ముగియడమే తడవుగా, గ్రామ పంచాయతీల నిధులను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన కుట్రలకు తెరలేపిందని వైయస్సార్సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న సర్పంచుల పదవీకాలం పూర్తి కాగానే, ఏప్రిల్ 3న ఆగమేఘాల మీద ‘నీటి భద్రత’ పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన జీవోల వెనుక అసలు ఉద్దేశం టీడీపీ నేతలను పందికొక్కుల్లా మేపడమేనన్నారు.కేంద్రం విడుదల చేసిన రూ. 1,026 కోట్ల నిధులను ఇన్నాళ్లూ తొక్కిపెట్టి, ఇప్పుడు స్పెషల్ ఆఫీసర్ల పాలన అడ్డం పెట్టుకుని అధికారుల ద్వారా నిధులు మళ్లించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. బీసీ జనాభాను తేల్చకుండా, ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తూ గ్రామాల్లో దోపిడీకి బాటలు వేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా హక్కులను కాలరాస్తూ, మరోవైపు వైయస్సార్సీపీ హయాంలో నియమితులైన 8,500 మంది పంచాయతీ సెక్రటరీల జీతాల్లో కోత విధిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని.. ఈ అక్రమాలపై తాము పోరాటం చేస్తామని రవీంద్ర రెడ్డి హెచ్చరించారు.”

# ఒక చెక్క బకెట్ కోసం మహా యుద్ధం

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** 1325లో, ఒక చెక్క బకెట్ దొంగతనం కారణంగా మోడెనా - బోలోగ్నా అనే రెండు ఇటాలియన్ నగరాల మధ్య భీకర యుద్ధం చెలరేగింది. ఈ బకెట్ యుద్ధంలో వేలాది మంది సైనికులు మరణించారు, కానీ బోలోగ్నా తన బకెట్‌ను తిరిగి పొందలేకపోయింది, అది నేటికీ మోడెనాలో భద్రంగా ఉంది.రెండు నగరాలు ఒకదానినొకటి నాశనం చేసుకోవాలని శపథం చేసినప్పుడు; 1325లో రక్త నదులు ఎందుకు ప్రవహించాయో తెలుసుకుందాం భూమి, అధికారం 0 బలం కోసం అనేక ప్రధాన యుద్ధాలు జరిగాయి. కానీ ఒక యుద్ధానికి కారణం చాలా చిన్నది. ఈ కథ 1325వ సంవత్సరంలో జరిగింది ఆ సమయంలో ఒక సాధారణ చెక్క బకెట్ కోసం మోడెనా - బోలోగ్నా మధ్య భీకర యుద్ధం జరిగింది. చరిత్రలో ఈ సంఘటనను ‘బకెట్ యుద్ధం’ అని పిలుస్తారు. ఇది వింతగా అనిపించవచ్చు, కానీ ఆ సమయంలో, ఈ వివాదం చాలా ముఖ్యమైనదిగా మారింది.నిజానికి, ఆ రెండు నగరాల మధ్య అప్పటికే శత్రుత్వం ఉండేది. ఆ సమయంలో, ఇటలీ అనేక చిన్న రాజ్యాలుగా విభజనకు గురయింది, ప్రతి నగరం తన అధికారాన్ని పెంచుకోవాలని చూసేది. అటువంటి వాతావరణంలో, ఒక చిన్న సంఘటన కూడా పెద్ద సంఘర్షణకు దారితీసేది. కొంతమంది మోడెనా సైనికులు బోలోగ్నాలోకి ప్రవేశించి, అక్కడి నుండి ఒక చెక్క బకెట్‌ను దొంగిలించారని చెబుతారు. ఆ బకెట్‌ను ఒక బావి నుండి తీసుకున్నారు. ఈ సంఘటన నిప్పుకు ఆజ్యం పోసినట్లు అయ్యింది.బకెట్ దొంగతనం బోలోగ్నా ప్రజలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది, వారు దానిని అవమానంగా భావించారు. ఆ నగర నాయకులు బకెట్‌ను తిరిగి



ఇవ్వాలని మోడెనాను డిమాండ్ చేశారు, కానీ మోడెనా ఖచ్చితంగా నిరాకరించింది. దీంతో ఆ రెండు నగరాలు ముఖాముఖిగా తలపడ్డాయి. ఈ వివాదం క్రమంగా తీవ్రమై, ఇరువైపులా వేలాది మంది సైనికులు పాల్గొన్న పూర్తిస్థాయి యుద్ధంగా మారింది.ఈ యుద్ధం అత్యంత భయంకరమైనది. కత్తులు ఝుళిపించబడ్డాయి, గుర్రాలు దూసుకెళ్లాయి, సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. ఈ యుద్ధంలో వేలాది మంది మరణించారని చెబుతారు. చివరికి, మోడెనా యుద్ధంలో విజయం సాధించింది. ఆసక్తికరంగా, విజయం తర్వాత కూడా మోడెనా ఆ చెక్క బకెట్‌ను తన వద్దే ఉంచుకుంది.ఈనాటికీ ఆ బకెట్ మోడెనాలో భద్రంగా ఉందని చెబుతారు. అహం, శత్రుత్వంతో కూడిన చిన్న విషయాలు కూడా గొప్ప వినాశనానికి కారణమవుతాయని ఈ సంఘటన మనకు నేర్పుతుంది. బకెట్ యుద్ధం అనేది చరిత్రలోని విచిత్రమైన సంఘటనలలో ఒకటి, ఇది నేటికీ ప్రజలను ఆశ్చర్యపరుస్తూనే ఉంది.

# మానసిక ప్రశాంతతకు నవకార్ మంత్రం





**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** నవకార్ మహా మంత్రం పఠించినా, విన్నా మానసిక ప్రశాంతత లభిస్తుందని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో గురువారం జరిగిన ప్రపంచ నవకర్ మంత్ర దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ముందుగా భగవాన్ మహావీర్ చిత్రపటానికి నమస్కరించి వేదికపై ఉన్న రాజ్ నమ్రతా శ్రీజీ ఆశీస్సులు తీసుకున్నారు. జైన్ కుటుంబ సభ్యులందరికీశుభాకాంక్షలు తెలిపారు. జైన పెద్దలు, సోదర , సోదరీ మణులతో కలసి కొద్దిసేపు నవకార్ మహామంత్ర పఠనం చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మహామంత్ర దివస్ వేడుకలలో పాల్గొని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ఇచ్చిన సందేశాన్ని విన్నారు. అనంతరం మాట్లాడుతూ.... ప్రపంచవ్యాప్తంగా సుమారు 9000 సెంటర్లలో ప్రపంచ నౌకార్ మహతంత్ర దివస్ కార్యక్రమం ను ఏక కాలంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఢిల్లీ నుంచి కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా సైతం అక్కడ వేడుకలలో పాల్గొని సందేశం ఇవ్వడం, విజయవాడలో తాను ఇక్కడ మహామంత్ర దివస్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నవకార్ మహా మంత్రం మనసుకు ప్రశాంతతను, స్థిరత్వాన్నిఇస్తుందన్నారు., ప్రతి ఒక్కరిలోనూ సమాన భావాన్ని ప్రసాదించే ఒక పవిత్ర శక్తి అన్నారు. పధానమంత్రి నరేంద్ర మోడీ జైన్ గురువుల ఆచారాలను పాటించడం వల్లే ప్రపంచ స్థాయి నాయకుడిగా ఎదిగారని, అరిహంత్‌లు, సిద్ధులు, ఆచార్యులు వంటి మహోన్నత గురువులు చూపిన బాటలో శాంతియుత సమాజంలో అహాన్ని వీడి నడవడమే నవకర్ మహా మంత్ర ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. బయట ఉన్న శత్రువుల కంటే మనలోని అహంకారం, కోపం, లోభితనం వంటి ప్రతికూల ఆలోచనలను జయించడమే నిజమైన విజయమని భగవాన్ మహావీరుడు బోధించారన్నారు .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం తన కోపాన్ని విడనాడి శాంతియుత భావాలతో పరోక్షంగా జైన్ మత సిద్ధాంతాలతో నడుస్తున్నారని, ప్రభుత్వ పరంగానూ జైనుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. విజయవాడ నగరాన్ని గొప్ప వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దడంలో జైన్ సమాజం చేసిన కృషి మరువలేనిదన్నారు. పేద ప్రజల కోసం జైన్ సమాజం నిర్వహిస్తున్న విద్యా, వైద్య మరియు అన్నదాన కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవని, జైన్ సమాజం కోరిన విధంగా స్కూల్ , హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధిత మంత్రులను కలిసి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని శివనాథ్ తెలిపారు. విజయవాడ నగరం అభి వృద్ధి , ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో జైన సమాజం, జైన్ యువత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీఐటీఓ) విజయవాడ చాప్టర్ ఛైర్మన్ కమలేష్ జైన్ ఫోలోముతా మాట్లాడుతూ....విజయవాడ నగరంలో జైనులకు ఏ సమస్య వచ్చినా, తెలియజేయగానే ఆ సమస్య పరిష్కారంకు ఎంపి కేశినేని చిన్ని కృషి చేస్తున్నారని అందుకు జైన సమాజం పక్షాన ధన్యవాదాలు తెలిపారురు. జిటోవిజయవాడ చాప్టర్ మేనేజింగ్ కమిటీ ప్రతినిధులు దినేష్ కుమార్ జైన్, మనీష్ కుమార్, రాకేష్ కుమార్ జైన్, మనీష్ కుమార్ జైన్, కుందమ్మాల్ గాంధీ, ప్రవీణ్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫీ మోజులో . జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9**అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన అనంతగిరి మండలం మూలగుమ్మి సమీపంలోని జలపాతం వద్ద జరిగింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. మరో స్నేహితురాలు అంజలితో కలిసి నలుగురూ అనంతగిరిలోని జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. అక్కడ జలపాతం అంచున నిలబడి సెల్ఫీ దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు.ఈ ప్రమాదంలో త్రిష, రత్నకుమారి, పవిత్ర అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అంజలిని స్థానికులు గమనించి లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా ముగ్గురు బాలికలు మృతి చెందడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బీఆర్ఎస్ పార్టీలోకి జీవన్‌రెడ్డి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ప్రకటించారు. శేషజీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తు కోసం కూడా పాటుపడవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు, జగిత్యాలలో జీవన్ రెడ్డిని బీర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్న కేటీఆర్... జీవన్ రెడ్డితో ఆయన నివాసంలో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ వెంట ఎల్. రమణ, పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు



## ఉత్సాహంగా వసంత కృష్ణప్రసాద్ జన్మదినోత్సవం

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం ఉత్సాహంగా నిర్వహించారుజన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు మైలవరం నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు, నాయకులు, అభిమానులు, అధికారులు భారీగా తరలివచ్చారు. ఎం ఎల్ ఏకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భారీ కేకులను కట్ చేశారు ఆయనతో ప్రత్యేకంగా సెల్ఫీలు దిగారు. అందరినీ ఆత్మీయంగా ఆహ్వానించి వారిని పేరుపేరు నా పలుకరిస్తూ స్వాగతించారు.మైలవరం నియోజకవర్గంలో పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మూలపాడు గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ నాయకులు గ్రామాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో అన్ని మండలాల నాయకులు, ఆత్మీయులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, టీడీపీ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.టీడీపీ రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, ఏఎంసి చైర్మన్ నర్రా వాసు , నూతులపాటి వెంకటేశ్వరరావు, కాటంనేని పూర్ణచంద్రరావు, జాలిపర్తి గోపాలకృష్ణ , బొర్రా తిరుపతిరావు,వడ్లమూడి చలపతిరావు, నూతులపాటి జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు




## కనకదుర్గనగర్ బాత్రూంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** విజయవాడ దుర్గగుడి కొండ దిగువన కనకదుర్గనగర్ బాత్ రూంలో గురువారం ఒక గుర్తు తెలియని వ్యక్తి (50) మృత దేహాన్ని గుర్తించారు. అనుమానాస్పద రీతిలో పడి ఉన్న మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో శానిటేషన్ సిబ్బంది ఆలయ అధికారులకు తెలిపారు. పోలీసులు ఆలయ అధికారులు వచ్చి బాత్‌రూమ్ లోపల వేసి ఉన్న గడియను తొలగించి చూశారు. సుమారు మూడు రోజుల క్రితమే మృత దేహం ఉన్నట్లుగా చెబుతున్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు కనిపించలేదు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు

## దుర్గగుడిలో అన్నవితరణకు విరాళాలు





**విశ్వంవాయిస్,విజయవాడ, ఏప్రిల్ 9** విజయవాడ సమీపంలోని కామయ్యతోపు ఏర్పాటు చేసిన పొత్తులూరి అనిత, అమరేంద్ర పేరున అన్నదానం ట్రస్టుకు గురువారం రూ. 1,00,116 విరాళంగా ఏర్పాటు. ఆలయానికి వచ్చిన దాతలు అధికారులను కలసి విరాళాన్ని దేవస్థానానికి జమ చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆలయ మర్యాదలను అందించారు. విజయవాడ దేవీనగర్‌కు చెందిన ఎం యామిని అరుణశ్రీ అన్నదానం ట్రస్టుకు రూ. 1,00,000 విరాళంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ గాంధీని కలసి అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆలయ మర్యాదలను అందించారు

## పశువులకు తాగునీరు ఏర్పాటు.....



**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో గ్రామీణ ప్రాంతాలలో నీటి తొట్టెలను నిర్మించి, వేసవిలో పశువులకు తాగునీటి వసతి కల్పించినట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ టి దామోదర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవి కాలంలో పశువులు, జీవాల నీటి కొరతను అధిగమించడానికి పటిష్ట చర్యలు తీసుకుందన్నారు నీటి తొట్టెలను నిర్మించి త్రాగునీటి వసతి కల్పించామన్నారు. స్థానిక పంచాయితీ రాజ్ ,పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నీటి తొట్టెలను పర్యవేక్షిస్తున్నారన్నారన్నారు.శాఖలను సమన్వయం చేసుకుంటూ, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సహకారం కూడా తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించామన్నారు.?పశుపోషకులు, స్వయం సహాయక సంఘాల వారు, అవసరమైన ప్రాంతాలలో నీటి తొట్టెల ఏర్పాటు కోసం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో గానీ లేదా పశువైద్యశాలలో గానీ సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## జగన్ మోహన్ రెడ్డి- మావిగన్ జోకర్

**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి జగన్ తన సొంతానికి ప్యాలెస్ లు కట్టుకున్నాడని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు వారసులం అని చెప్పుకునే జగన్ వైఎస్ఆర్ పేరును వాడుకున్నారు తప్పిస్తే.. ఆయన ఆశయాలకు వారసులు కాలేదన్నారు వైసీపీలో నిజంగా వైఎస్ఆర్ ఐడియాలజీ ఉంటే ..జగన్ సీఎం కూడా వైఎస్ఆర్ జల యజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదన్నారు వైఎస్ఆర్ వ్యతిరేకించిన బీజేపీ దత్తపుత్రుడుగా ఎందుకు మారారు ? దళితులపై, క్రిస్టియన్లపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారన్నారని ప్రశ్నించారు. వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం పాదయాత్రకు నేటికి 23 ఏళ్లు. వైఎస్ఆర్ ఐడియాలజీ కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు

## జగన్‌కు రాజకీయ పరిణతి లేదు



**విశ్వంవాయిస్,విజయవాడ,ఏప్రిల్ 9** రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడుస్తున్నా, ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికీ ఒక శాశ్వత రాజధాని లేకపోవడం దురదృష్టకరమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. . సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో గురువారం జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన... రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ వైఫల్యానికి సంబంధించి ఒకవైపు సీఎం చంద్రబాబు, మరోవైపు మాజీ సీఎం జగన్ ఇద్దరూ సిగ్గుపడాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజధాని అభివృద్ధికి జరుగుతున్న కృషికి అందరూ సహకరించాలని కోరారు.జగన్‌కు రాజకీయ పరిణతి లేదని రాఘవులు నేరుగా విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. మొన్నటి వరకు ‘మూడు రాజధానులు’ అంటూ కాలక్షేపం చేసిన జగన్, ఇప్పుడు ఆ అంశాన్ని పక్కనపెట్టి ‘మావిగన్’ అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రానికి ఒక రాజధాని ఏర్పడుతున్న తరుణంలో అందరూ ఆనందించి, తోడ్పాటు అందించాలి తప్ప, అడ్డుతగిలేలా మాట్లాడటం రాజకీయ నాయకులకు తగదని చురకలు అంటించారు.

# మరింతగా పెరగనున్న ఎల్‌నినో' ప్రమాదం



**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9**జనం ఇప్పుడు అనుభవిస్తున్నది సాధారణ వేసవి వేడి కాదు. ఇది నిశ్శబ్దంగా ప్రాణాలను తీస్తుంది ప్రియమైన వారిని దూరం చేసే ఎల్ నినో అనే వాతావరణ పరిస్థితి. మే నెల చేరుకునే సరికి పరిస్థితి ఇంకా తీవ్రమవుతుంది.సులభంగా చెప్పాలంటే, పసిఫిక్ మహాసముద్రంలోని నీరు అసాధారణంగా వేడెక్కుతుంది. దాంతో ప్రపంచవ్యాప్తంగా గాలి ప్రవాహం మారుతుంది. మే నెలలో వర్షాలు తీసుకురావాల్సిన దక్షిణ పశ్చిమ మాన్సూన్ ఈసారి ఆలస్యమవచ్చు లేదా తక్కువగా ఉండవచ్చు. అంటే, వర్షాలు పడాల్సిన సమయంలో తీవ్ర ఎండ ఉండే అవకాశం ఉందిహీట్ స్ట్రోక్ వల్ల ఆరోగ్యంగా ఉన్నవారికీ ప్రమాదం కలగవచ్చు. ప్రాణాలను కాపాడుకోవడానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలి:దాహం వచ్చే వరకు వేచి ఉండడం ప్రమాద సూచకం.దాహం అనేది శరీరంలో ఇప్పటికే నీరు తగ్గిందని సూచిస్తుంది. ప్రతి గంటకు ఒకసారి నీరు తాగాలి పిల్లలకు, వృద్ధులకూ తప్పనిసరిగా నీరు తాగించాలి. ఎప్పుడూ వాటర్ బాటిల్‌ను దగ్గర ఉంచుకోవాలి. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు అత్యంత ప్రమాదకర సమయం.ఈ సమయంలో ఎండ నేరుగా శరీరాన్ని ప్రభావితం చేస్తుంది.సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. లేదా కార్యాలయాలలో ఉండాలి. బహిరంగ ప్రదేశాలలో పనిచేసేవారు తగిన నీడ ఉండేలా చూసుకోవాలి. ఎండ వేడిమి శరీరానికి చురుకుగా తగిలి, చురుకుగా ఉన్నట్లయితే వెంటనే నీడకు చేరుకోవాలి. గొడుగులు, తలపాగాలు తప్పనిసరిగా వాడుకోవాలి .పాఠశాలలో క్రీడా కార్యక్రమాలను ఎండ బాగా తగ్గాక నిర్వహించాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి పిల్లల ప్రాణం ఏ బహుమతికన్నా కూడా విలువైనదిగా గమనించాలి, ముఖ్య అతిథులకు స్వాగతం పలకడానికి ఎంతో సమయం పాటు పిల్లలను ఎండలో నిలబెట్టకూడదు.వారికి మంచినీరు వంటివి అందించాలి నలుపు రంగు బట్టలు వేడిని ఎక్కువగా ఆకర్షిస్తాయి. తెలుపు లేదా లేత రంగు పత్తి దుస్తులు ధరించడం వల్ల శరీరాన్ని ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చుహీట్ స్ట్రోక్ లక్షణాలను గురించి చెప్పాలంటే,తీవ్రమైన తలనొప్పి,తల తిరగడం,వాంతులు,చెమట రాకపోవడం, చర్మం ఎండిపోవడం వంటివి ఉంటాయి ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే నీడలోకి తీసుకెళ్లి, తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి, వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలి. ఇంటి పెంపుడు జంతువులు మాత్రమే కాదు, బయట ఉన్న జంతువులకు కూడా సహాయం చేయాలి ఇంటి ముందు లేదా గోడ దగ్గర నీటి తుట్టెలను ఉంచాలిఈనెల 19 నుండి మే 31 వరకు,ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు (ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు) వెళ్లకూడదు. ఎందుకంటే ఉష్ణోగ్రత 45 సెల్సియస్ నుంచి 55 సెల్సియస్ వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ అంచనాలు తెలియచేస్తున్నాయి. ఈ సమయంలో భూమి మీద నేరుగా 70% అతినీలలోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. ఎవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా అస్వస్థత కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. గాలి సరిగా వచ్చేలా గదుల తలుపులు తెరిచి ఉంచండి. మొబైల్ వినియోగాన్ని తగ్గించండి, అధిక వేడి కారణంగా మొబైల్ పేలే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి పెరుగు, మజ్జిగ, నిమ్మ పండు రసం వంటి చల్లని పానీయాలను ఎక్కువగా తీసుకోండి.పౌర రక్షణ విభాగం సూచనలు ఇలా ఉన్నాయి.రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47 సెల్సియస్ నుండి 55 సెల్సియస్ వరకు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే వేడి గాలులు ఉండే అవకాశం ఉంది. కాబట్టి ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి: కార్లలో ఉంచకూడని వస్తువులు:...గ్యాస్ పదార్థాలు,లైటర్లు,కార్బోనేటెడ్ పానీయాలు,సుగంధ ద్రవ్యాలు, బ్యాటరీలు గాలి ప్రసరణ కోసం కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచండి,కారు ఇంధన ట్యాంక్‌ను పూర్తిగా నింపకండిసాయంత్రం సమయంలో మాత్రమే కారులో ఇంధనం నింపండిఉదయం ఈ సమయంలో కారులో ప్రయాణం చేయడం నివారించండిప్రయాణ సమయంలో టైర్లలో అధిక గాలి నింపకండితేళ్లు , పాములు చల్లని ప్రదేశాల కోసం ఇళ్లలోకి రావచ్చు, కాబట్టి జాగ్రత్తగా ఉండండి ఎక్కువగా నీరు ద్రవాలు తాగండి గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచవద్దు విద్యుత్ మీటర్లపై అధిక లోడ్ వేయవద్దు అవసరమైన గదుల్లో మాత్రమే ఎయిర్ కండిషనర్ ఉపయోగించండి ప్రతి 2--3 గంటలకు కనీసం 30 నిమిషాలు విశ్రాంతి తీసుకోండి బయట ఉష్ణోగ్రత 45--47 సెల్సియస్ ఉన్నపుడు , ఇంట్లో ఏసీని 24--25 వద్ద ఉంచండి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నేరుగా సూర్యకాంతిని తప్పించండి

# అంతరిక్షంలో ప్రచ్ఛన్న యుద్ధం




**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9** అంతరిక్ష ప్రపంచంలో పోటీ ఇప్పుడు కేవలం చంద్రుడిని చేరుకోవడం గురించే కాదు, అక్కడ ఒక స్థావరాన్ని ఏర్పాటు చేయడం గురించికూడా ఉంది. ఒకవైపు, తన గత యాత్ర 'లూనా 25' వైఫల్యాన్ని మరిచిపోయి, రష్యా ఇప్పుడు చైనా సహకారంతో చంద్రుడిపై ఒక అణు విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతుండగా, మరోవైపు నాసా ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. నాసా తన ఆర్టెమిస్ 2 యాత్రతో తమ సన్నాహాలు దాదాపు పూర్తయ్యాయని నిరూపించినప్పటికీ, వ్యోమగాములు చంద్రుడిపై అడుగు పెట్టడానికి ఇంకా 2028 వరకు సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో, రష్యా వైదొలగడం మరియు నాసా వాయిదా వేయడం ఈ "అంతరిక్ష పోటీ"ని ఒక అత్యంత ఉత్కంఠభరితమైన మలుపునకు తీసుకువచ్చాయి. అంతరిక్షంలో ఏం జరుగుతోందో, మనం (మానవులు) చంద్రుడిని, ఆ తర్వాత మళ్లీ అంగారకుడిని ఎప్పుడు చేరుకుంటారన్న అసక్తికరం

**రష్యాకు ఏమైంది?** ఒకప్పుడు అంతరిక్ష శాస్త్రంలో రష్యా తిరుగులేని రాజుగా ఉండేది. కానీ గత సంవత్సరం, దాని లూనా-25 యాత్ర చంద్రుని ఉపరితలంపై కూలిపోయింది. దశాబ్దాల తర్వాత చంద్రునిపైకి తిరిగి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న రష్యాకు ఇది ఒక పెద్ద ఎదురుదెబ్బ. ఇప్పుడు, తన తప్పుల నుండి గుణపాఠం నేర్చుకున్న రష్యా, లూనా-26 , లూనా-27లపై వేగంగా పనిచేస్తోందని వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు రష్యా లక్ష్యం కేవలం చంద్రునిపై దిగడమే కాదు, అక్కడ ఒక స్థావరాన్ని ఏర్పాటు చేయడం కూడా. ఈ లక్ష్య సాధన కోసం, అది చైనాతో చేతులు కలిపింది. 2030 నాటికి చంద్రునిపై ఒక అణు విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రష్యా కోరుకుంటోంది, ఇది దీర్ఘకాలిక విద్యుత్‌ను అందిస్తుంది.

**రష్యా మిషన్లలో భారీ జాప్యం** అయితే రష్యా ప్రస్తుతం తన మిషన్ల గురించి ఆందోళన చెందుతోంది. రష్యన్ అంతరిక్ష సంస్థ (రోస్కోస్మోస్), వాస్తవానికి 2027లో జరగాల్సిన తన లూనా-26 మిషన్‌ను 2028కి వాయిదా వేసింది. రష్యా లూనా-28, 29, 30 మిషన్లను కూడా వాయిదా వేస్తోంది. ఈ మిషన్లు ఇప్పుడు 2032 , 2036 మధ్య ప్రయోగించనున్నట్లు రష్యన్ అంతరిక్ష సంస్థ చెబుతోంది. మిషన్లలో ఈ జాప్యాలు రష్యాకు ఆందోళన కలిగిస్తున్నాయి. అయినప్పటికీ, నాసా కు చెందిన ఆర్టెమిస్ కంటే ముందే చంద్రునిపై అడుగుపెట్టడానికి రష్యా ఇప్పటికీ ప్రయత్నిస్తోంది.

**రష్యా మిషన్‌ను ఎందుకు వాయిదా వేశారు?**రష్యా అంతరిక్ష సంస్థ, రోస్కోస్మోస్, ఈ మిషన్ల వాయిదాకు అధికారికంగా కారణాన్ని వెల్లడించనప్పటికీ, అనేక ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. 2023లో చంద్రునిపై రష్యాకు చెందిన మానవరహిత లూనా-25 అంతరిక్ష నౌక కూలిపోవడమే దీనికి ప్రాథమిక కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. సోవియట్ శకం తర్వాత రష్యా చేసిన మొదటి ప్రయత్నం ఇది, దాని వైఫల్యం విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఉక్రెయిన్ యుద్ధం అంతర్జాతీయ ఆంక్షలు మరో కారణం. ఈ అంశాలు రష్యా దృష్టిని, బడ్జెట్‌ను రక్షణ వైపు మళ్లించి, దాని అంతరిక్ష కార్యక్రమంపై ప్రభావం చూపాయి.

**నాసా 'ఆర్టెమిస్' మిషన్ ఎందుకు ఆలస్యం అవుతోంది?**నాసా కూడా తన ఆర్టెమిస్ మిషన్ ద్వారా మానవులను తిరిగి చంద్రుడిపైకి పంపడానికి సిద్ధమవుతోంది. అయితే, ఈ మిషన్ పదేపదే ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం ఓరియన్ క్యాప్సూల్ యొక్క హీట్ షీల్డ్, లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌లో ఉన్న సమస్యలే. ఈసారి ఈ మిషన్‌లో మానవులను తీసుకెళ్లనున్నందున, నాసా ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి సుముఖంగా లేదు. ఈ లక్ష్యంతోనే, అసలైన ల్యాండింగ్‌కు ముందు, నాసా ఆర్టెమిస్-2 మిషన్‌ను ప్రారంభించింది. దీనిలో వ్యోమగాములు చంద్రుడి చుట్టూ పరిభ్రమించి భూమికి తిరిగి వస్తారు. ఆర్టెమిస్-3 మిషన్ ద్వారా మానవులను చంద్రుడిపై దించాలని నాసా యోచిస్తోంది.

**ఇకపై చంద్రుడు కాదు, అదే అసలైన గమ్యస్థానం.**రాబోయే అంతరిక్ష పోటీ చంద్రుడికి మాత్రమే పరిమితం కాదు. అంతరిక్ష సంస్థలు ఇప్పుడు చంద్రుడిని ఒక "తాత్కాలిక కేంద్రం"గా చూస్తున్నాయి. వారి ప్రాథమిక లక్ష్యం అంగారకుడిని చేరుకోవడం. ఏ దేశమైతే చంద్రుడిపై స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటుందో, ఆ దేశానికి అంగారకుడికి వెళ్లే మార్గం సులభతరం అవుతుందని నాసా మరియు రష్యా రెండూ నమ్ముతున్నాయి. ఈ లక్ష్య సాధన కోసం, రష్యా చైనాతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకుంది. రష్యా-చైనా స్నేహం అమెరికాలో ఆందోళనలను రేకెత్తించింది. చైనా తన టియాంగాంగ్ అంతరిక్ష కేంద్రం, చంద్ర యాత్రపై నిశ్శబ్దంగా పనిచేస్తోంది.

**సామాన్యుడికి దీని అర్థం ఏమిటి?** ఈ దేశాల మధ్య జరుగుతున్న ఈ యుద్ధం వల్ల మనం ఏమి సాధిస్తామని మీరు ఆశ్చర్యపోవచ్చు. నేను మీకు చెప్పేది ఏమిటంటే, ఇది కేవలం ఒక బలమైన స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవడానికి జరిగే పోరాటం కాదు. చంద్రునిపై హీలియం-3 వంటి అరుదైన మూలకాలు ఉన్నాయి, ఇవి భూమి ఇంధన అవసరాలను శాశ్వతంగా తీర్చగలవు. అంతేకాకుండా, అంతరిక్షం కోసం అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వైద్య శాస్త్రంలో ఉపయోగపడుతుంది. భూమి వనరులు తరిగిపోతున్న కొద్దీ, శాస్త్రవేత్తలు భవిష్యత్తు కోసం ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను (ప్లాన్ బి) (మరో గ్రహంపై జీవం) అభివృద్ధి చేస్తున్నారు.

**ప్రచ్ఛన్న యుద్ధం మళ్లీ మొదలైందా?**అవును, నిపుణులు దీనిని 'స్పేస్ రేస్ 2.0' అని అంటున్నారు. 1960వ దశకంలో, ఈ పోటీ కేవలం యునైటెడ్ స్టేట్స్ సోవియట్ యూనియన్ మధ్య మాత్రమే ఉండేది. నేడు, చైనా ఒక ప్రధాన శక్తిగా ఆవిర్భవించింది, భారతదేశం (ఇస్రో) తన తక్కువ బడ్జెట్, కచ్చితమైన మిషన్లతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రష్యా ప్రస్తుతం ఆర్థిక ఆంక్షలు. యుద్ధం వల్ల ఒత్తిడిలో ఉన్నప్పటికీ, అంతరిక్షంలో తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తోంది.

# ప్రపంచ అందగత్తె కు 25 సంవత్సరాల వయస్సు



**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9** 2006లో వోగ్ ఎన్‌ఫాంట్స్ ద్వారా 'ప్రపంచంలోనే అత్యంత అందమైన అమ్మాయి'గా పేరు పొందిన ఫ్రెంచ్ మోడల్ థైలేన్ బ్లోండో, ఈనెల 5న తన 25వ పుట్టినరోజును జరుపుకుంది. ఆమెకు కీర్తిని తెచ్చిపెట్టిన మోడలింగ్ షాట్ ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆమె జీన్ పాల్ గౌల్టియర్ డోల్స్ , గబ్బానా వంటి అగ్రశ్రేణి అంతర్జాతీయ డిజైనర్ల కోసం ర్యాంప్‌పై నడిచింది , 6 సంవత్సరాల వయస్సులోనే 'ప్రపంచంలోనే అత్యంత అందమైన అమ్మాయి'గా పేరు పొందింది. థైలేన్ లేనా-రోజ్ లౌబ్రీ బ్లోండో, థైలేన్ బ్లోండోగా సుప్రసిద్ధురాలు, ఒక ప్రసిద్ధ ఫ్రెంచ్ మోడల్. ఆమె తన 4వ ఏట మోడలింగ్ కెరీర్‌ను ప్రారంభించి, 2006లో, కేవలం 6 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు, వోగ్ ఎన్‌ఫాంట్స్ ద్వారా 'ప్రపంచంలోనే అత్యంత అందమైన అమ్మాయి'గా ఎన్నికయ్యారు. తన అద్భుతమైన ప్రయాణంలో, థైలేన్ బ్లోండో డోల్స్, గబ్బానా, లోరియల్ మరియు వెర్సాచే వంటి అనేక అగ్రశ్రేణి డిజైనర్ల కోసం మోడలింగ్ చేశారు.ఫ్రాన్స్‌లోని ఐక్స్-ఎన్-ప్రోవెన్స్‌లో జన్మించిన థైలేన్ బ్లోండో, ఫుట్‌బాల్ క్రీడాకారుడైన పాట్రిక్ బ్లోండో , నటి, టెలివిజన్ వ్యాఖ్యాత వెరోనికా లౌబ్రీల కుమార్తె. థైలేన్ బ్లోండోకు ఐర్టన్ బ్లోండో తమ్ముడు ఉన్నాడు. వారి తల్లిదండ్రులైన వెరోనికా, పాట్రిక్ 2002లో వివాహం చేసుకుని, 2016లో విడాకులు తీసుకున్నారు.ఏడేళ్ల వయసులో ఫోటోగ్రాఫర్ డాని బ్రూబేకర్‌తో ఆమె తన మొదటి ఫోటోషూట్ చేసింది. హ్యూగో బాస్ ఇతర పిల్లల ఫ్యాషన్ ప్రచారాలతో సహా పలు ప్రచారాలకు ఆమె అతనికి స్ఫూర్తిగా నిలిచింది. 13 ఏళ్ల వయసులో, ఆమె జలూస్ పత్రిక ముఖచిత్రంపై కనిపించింది. 2015లో, ఆమె డోల్స్ గబ్బానా కోసం ర్యాంప్‌పై నడిచింది2017లో, థైలేన్ బ్లోండో లోరియల్ పారిస్‌కు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. వికీపీడియా ప్రకారం, ఆమె డోల్స్ గబ్బానా వారి మిలీనియల్-థీమ్డ్ స్ప్రింగ్,మ్మర్ 2017 క్యాంపెయిన్‌లో జెండయా, లక్కీ బ్లూ స్మిత్ ప్రెస్లీ గెర్బర్‌లతో కలిసి నటించారు.

# 'నిజమైన ఒప్పందం' కుదిరే వరకు.....

**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9** ఇరాన్, అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల విరమణ నేపథ్యంలో, ఈ ఒప్పందం తాత్కాలికం కావచ్చని, మార్పులకు లోబడి ఉండవచ్చని సూచిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం టెహ్రాన్‌కు కొత్త హెచ్చరికలు జారీ చేశారు. ట్రూత్ సోషల్ లోని ఒక పోస్టులో ట్రంప్ ఇలా అన్నారు, "ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును ప్రాణాంతకంగా ఎదుర్కోవడానికి మరియు నాశనం చేయడానికి అవసరమైన అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు , ఇతర సామగ్రితో సహా అన్ని అమెరికా నౌకలు, విమానాలు సైనిక సిబ్బంది, కుదిరిన 'నిజమైన ఒప్పందం' పూర్తిగా పాటించబడేంత వరకు ఇరాన్‌లో మరియు దాని చుట్టుపక్కల మోహరించి ఉంటారన్నారుఇరాన్‌తో సంఘర్షణకు విరామం ఇచ్చే లక్ష్యంతో కుదిరిన ఒప్పందంలోని నిబంధనలను పాటించేలా చూడటానికే అమెరికా సైనిక వనరులను నిరంతరం మోహరిస్తున్నట్లు ఆయన సూచించారు.ఒప్పందం నుండి ఏమాత్రం పక్కకు తప్పుకున్నా సైనిక చర్యను తీవ్రతరం చేయాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరిస్తూ, "ఒకవేళ ఏ కారణం చేతనైనా అలా జరగకపోతే, అది జరగడం అత్యంత అసంభవం, అప్పుడు 'షూటింగ్ స్టార్ట్స్' అవుతాయి, అది మునుపెన్నడూ ఎవరూ చూడనంత పెద్దదిగా, మెరుగ్గా బలంగా ఉంటుందని రాశారు.తన పోస్ట్‌లో, ఇరాన్ అణు కార్యక్రమం మరియు ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధి నిరంతరాయంగా పనిచేయడం గురించి అమెరికా దీర్ఘకాలంగా కోరుతున్న డిమాండ్లను కూడా ట్రంప్ నొక్కి చెప్పారు."దీనికి విరుద్ధంగా ఎన్ని బూటకపు మాటలు చెప్పినప్పటికీ, చాలా కాలం క్రితమే ఒక ఒప్పందం కుదిరింది -- అణ్వాయుధాలు ఉండవు, హోర్ముజ్ జలసంధి తెరిచి సురక్షితంగా ఉంటుందని ట్రంప్ అన్నారు.అవసరమైతే మరిన్ని ఆపరేషన్లకు అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. "ఈలోగా తమ గొప్ప సైన్యం సన్నద్ధమవుతూ, విశ్రాంతి తీసుకుంటూ, వాస్తవానికి తన తదుపరి విజయయాత్ర కోసం ఎదురుచూస్తోందన్నారు అసోసియేటెడ్ ప్రెస్ ప్రకారం, సంభావ్య అణ్వాయుధ సామర్థ్యానికి సంబంధించిన కీలక ఆందోళన అయిన సుసంపన్న యురేనియంకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి టెహ్రాన్‌తో కలిసి పనిచేస్తామని అమెరికా సూచించినప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమ స్థితి అస్పష్టంగానే ఉంది.

# మళ్ళీ మూతపడిన హోర్ముజ్ జలసంధి




**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9** అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రకటన వెలువడిన 24 గంటలలోపే, బుధవారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 188 మంది మరణించిన ఘటనకు ప్రతిస్పందనగా హోర్ముజ్ జలసంధిని మళ్లీ ఇరాన్ సైన్యం మూసివేయడంతో, ఈ సంధి విచ్ఛిన్నమయ్యే అంచున ఉన్నట్లు కనిపిస్తోంది.ఈ మూసివేతపై వైట్ హౌస్ స్పందిస్తూ, దీనిని "ఆమోదయోగ్యం కాదు" అని పేర్కొంది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ విషయం తెలిపింది. ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందంలోని కీలక షరతు అయిన హోర్మును వెంటనే తిరిగి తెరవడం వంటి విషయాల్లో ఇరాన్ వైఖరి, అది రహస్యంగా చెబుతున్నదానికి భిన్నంగా కనిపిస్తోందని కూడా అది జోడించింది.హోర్ముజ్ జలసంధిలో ఓడలపై ఇరాన్ సుంకాలు వసూలు చేయడాన్ని అమెరికా అంగీకరించలేదని, "స్వేచ్ఛాయుత, నిరంతరాయ ప్రయాణానికే ప్రాధాన్యత ఉందని ఇరాన్ అటువంటి రుసుములను వసూలు చేయడానికి అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించలేదని" వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఒక పత్రికా సమావేశంలో తెలిపారు.తాను వేదికపైకి రాకముందే ఆ నివేదికల గురించి అధ్యక్షుడికి తెలియజేశారు. ఆ వైఖరి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మళ్ళీ చెబుతున్నాను, ఈ సందర్భంలో వారు బహిరంగంగా చెబుతున్నదానికి, రహస్యంగా చెబుతున్నదానికి తేడా ఉందని అన్నారు.

**హోర్ముజ్ మూసివేత, ఓడలు వెనక్కి** ..హోర్ముజ్ జలసంధిలోని పరిస్థితులపై పెరుగుతున్న అనిశ్చితిని సూచిస్తూ, ఇరుకైన జలమార్గం సమీపంలో అనేక నౌకలు తమ మార్గాన్ని మార్చుకుంటున్నట్లు సముద్ర ట్రాకింగ్ డేటా చూపించింది.వాటిలో ఆయిల్ ట్యాంకర్ అరోరా కూడా ఉందని, అది ముసందమ్ తీరం సమీపంలో అకస్మాత్తుగా యూ-టర్న్ తీసుకుని పర్షియన్ గల్ఫ్‌లోకి తిరిగి వెళ్లిపోయిందని ఇరాన్ ప్రెస్ టీవీ తెలిపింది. ఆ జలసంధిని మూసివేశారని కూడా అది పేర్కొంది.కాల్పుల విరమణ ప్రకటన తర్వాత బుధవారం కేవలం 7 నౌకలు మాత్రమే జలసంధిని దాటగలిగాయని క్లెప్లర్ నివేదించింది.

**ఇరాన్ హోర్ముజ్‌ను ఎందుకు మూసివేసింది** ముఖ్యంగా లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత, కాల్పుల విరమణ ఒప్పందంలోని నిబంధనలపై విభేదాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.సంఘర్షణలో అత్యంత ఘోరమైన రోజులలో ఒకటిగా నిలిచిన బుధవారం ఒక్కరోజే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 188 మంది మరణించగా, 800 మందికి పైగా గాయపడ్డారని లెబనీస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఆ ప్రాంతంలో కొనసాగుతున్న సైనిక చర్యకు ప్రత్యక్ష ప్రతిస్పందనగా హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ సంకేతాలు ఇచ్చింది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని ట్రంప్ , ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు

# ఒక్కపరుగుతో..



**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9** అరుణ్ జైట్లీ స్టేడియంలో 211 పరుగుల లక్ష్య ఛేదనలో , ఐపీఎల్ చరిత్రలోనే అతిపెద్ద ఛేదనను సాధించేందుకు కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను చేరువ చేశాడు . అయితే, పతుమ్ నిస్సంక వేగంగా 41 పరుగులు చేసి అవుటైన తర్వాత, మరో ఎండ్ నుంచి రాహుల్‌కు పెద్దగా మద్దతు లభించలేదు. అతను ఒంటరి పోరాటం చేసినప్పటికీ, ఈ భారత అంతర్జాతీయ ఆటగాడు 52 బంతుల్లో 92 పరుగులు చేసి అవుటయ్యాడు. దీంతో ఢిల్లీ ఆశలు ఆవిరైనట్లయ్యాయి.అయితే, మిల్లర్ జట్టును పోటీలో నిలబెట్టాడు. బ్యాటింగ్ చేస్తుండగా గాయం కారణంగా అతను మైదానం వీడాల్సి వచ్చింది, కానీ రాహుల్ ఔటవడంతో తిరిగి క్రీజులోకి వచ్చాడు. మ్యాచ్ గతిని మార్చేందుకు అతను సాహసోపేతమైన క్రికెట్ ఆడాడు, కానీ ఆ దక్షిణాఫ్రికా అంతర్జాతీయ ఆటగాడు జట్టును గెలిపించలేకపోయాడు, దీంతో ఈ సీజన్‌లో ఢిల్లీ తమ మొదటి ఓటమిని చవిచూసింది.మిల్లర్ అజేయంగా 41 పరుగులు చేసినప్పటికీ, ఆట ఉత్కంఠభరితంగా ముగియడంతో అది సాధ్యపడలేదు. మరోవైపు, ఈ సీజన్‌లో గుజరాత్‌కు ఇదే తొలి విజయం. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని జట్టు సీజన్ ఆరంభంలో వరుసగా రెండు ఓటములను చవిచూసి, విజయాల బాట పట్టాల్సిన తరుణంలో ఉంది.కెప్టెన్ ముందుండి నడిపించగా, గిల్ 45 బంతుల్లో 70 పరుగులు చేశాడు. ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న జోస్ బట్లర్ , 27 బంతుల్లో 57 పరుగుల ఆధిపత్య ఇన్నింగ్స్ ఆడి గుజరాత్‌కు పునాది వేశాడు. ఆ ఇద్దరూ నిష్క్రమించిన తర్వాత, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 పరుగులు బాది స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. వారి అద్భుతమైన ప్రదర్శన ఫలితంగా, గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 210 పరుగులు చేసింది. గుజరాత్ సునాయాసంగా గెలుస్తుందని భావించారు, కానీ మిల్లర్ ఆలోచనలు వేరేలా ఉన్నాయి. ఈలోగా, మధ్య ఓవర్లలో ఆధిపత్యం చెలాయించి, తన నాలుగు ఓవర్లలో కేవలం 17 పరుగులకే మూడు వికెట్లు పడగొట్టిన రషీద్ ఖాన్‌కే ఆ ఘనత దక్కుతుంది. ఢిల్లీ మెరుపు ఆరంభం తర్వాత గుజరాత్‌ను తిరిగి పోటీలోకి తీసుకువచ్చిన అతని ఆట అద్భుతం.చివరి ఓవర్‌లో 13 పరుగులు అవసరమైనప్పుడు ప్రసిద్ధ్ కృష్ణకు బంతిని అందించారు. నాలుగో బంతికి మిల్లర్ ఒక సిక్సర్ బాదడంతో, ఢిల్లీకి రెండు బంతుల్లో కేవలం రెండు పరుగులు మాత్రమే అవసరమయ్యాయి. అంతా అదుపులోనే ఉన్నప్పటికీ, మిల్లర్ మరోసారి జట్టును గెలిపించడంలో విఫలమయ్యాడు.

# అంతరిక్షం నుంచి చూస్తే సూర్యగ్రహణం ఎలా ఉంటుందంటే...



**విశ్వంవాయిన్,విజయవాడ,ఏప్రిల్ 9**అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా ఉంటుందో కళ్లకు కట్టే అద్భుతమైన చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసింది. చంద్రుడిపైకి మనుషులను పంపించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన 'ఆర్టెమిస్-2' మిషన్ ఈ అపురూప దృశ్యాలను బంధించింది. భూమిపై చంద్రుడి నీడ (ఛాయ) ఒక పెద్ద నల్లటి మచ్చలా కదులుతున్నట్లు చూపిస్తున్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాలను చూస్తుంటే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలోని గ్రాఫిక్స్‌ను చూస్తున్నట్లుందని నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రహణ సమయంలో భూమి అంచుల వెంబడి ప్రసరిస్తున్న కాంతి, మేఘాల మధ్య నుంచి కనిపిస్తున్న రంగులు మరో గ్రహాన్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తున్నాయని శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు.మానవులను చంద్రుడిపైకి తీసుకెళ్లే బృహత్తర ప్రయోగంలో ఆర్టెమిస్-2 మిషన్ అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించి భూమికి తిరిగి వస్తారు. ఈ మిషన్‌లో అమర్చిన అత్యాధునిక కెమెరాల ద్వారా ఈ చిత్రాలను తీశారు. ఇవి కేవలం అద్భుత దృశ్యాలు మాత్రమే కాదని, గ్రహణ సమయంలో భూ వాతావరణంలో జరిగే మార్పులు, కాంతి ప్రసరణ వంటి



అంశాలపై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయని నాసా తెలిపింది.వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి తీసిన ఈ ఫొటోలు సాంకేతిక విజయాన్ని చాటడమే కాకుండా, విశ్వంలోని అద్భుతాలను సరికొత్త కోణంలో వీక్షించే అవకాశాన్ని కల్పించాయని నాసా ప్రతినిధులు పేర్కొన్నారు

VISWAM VOICE (Telugu Daily). Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNILKUMAR. Published from H.No. 14-18-6, First Floor, Narravari Street, Beside Hotel Ilapuram, Gandhi Nagar, Vijayawada, Krishna District, AP - 520003. Printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, AP - 523001. PRGI Regn. No: APTEL/26/A1730. Email: viswamvoicenews@gmail.com.